ఏలూరు కార్పొరేషన్‌కు పన్ను పోటు

- కేవలం 57 శాతం మాత్రమే వసూలు
- మరో వారం రోజులే గడువు



ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం

ఏలూరు (టూటౌన్): పన్నుల వసూళ్లల్లో ఏలూరు నగర కార్పొరేషన్ వెనుకబడింది. మరో వారం రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఇప్పటి వరకు మొత్తం డిమాండ్‌లో ఆస్తిప న్నులో కేవలం 57 శాతం, వాటర్ ట్యాక్స్‌లో 22 శాతం మాత్రమే వసూలైంది. ఆస్తిపన్ను, వాటర్ ట్యాక్స్ పన్నులు పాత బకాయిలు, ఈ ఆర్థిక సంవత్సరం బకాయిలు కలిపి మొత్తం రూ.74 కోట్లు డిమాండ్ ఉండగా ఇప్పటి వరకు వసూలైంది కేవలం రూ.30.33 కోట్లు మాత్రమే. అయితే కేవలం మరో వారం రోజులు సమయం ఉండటంతో నగరపాలక సంస్థ అధికారులకు పన్నుల వసూలు కత్తిమీద సాము లాగానే తయారైంది. మూడవ క్వార్టర్ సమయం మరో కొద్ది రోజుల్లో ముగియనుంది. అయినా ఇంకా మొత్తం డిమాండ్‌లో కేవలం అన్నిర కాల పన్నులు 40 శాతం మాత్రమే వసూలైంది. పన్నుల వసూళ్ల కోసం ఎన్ని ప్రత్యేక చర్యలు తీసుకున్నా చెల్లించేందుకు ప్రజలు ముందుకు రాకపోవడం వల్లే ఈ పరిస్థితి ఉందని నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నారు. మరో ప్రక్క పన్నుల వసూళ్లకు సంబంధించి వార్డు సచివాలయ సిబ్బందిపై బాధ్యత వదిలేసి అధికారులు ఉదాసీనంగా వదిలేయడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని రాజకీయ ప్రతినిధులే చెప్పుకోవడం విశేషం.

ఇదీ పరిస్థితి

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో మొత్తం జనాభా 3.70 లక్షల మంది వరకు ఉన్నారు. మొత్తం 50 డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 79 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ప్రస్తుతం వార్డు సచివాలయ సిబ్బందినే పన్నుల వసూళ్లలో ఎక్కువగా వినియోగిస్తున్నారు. వీరిపై రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది అజమాయిషీ చేస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు. ఇప్పటి వరకు ఆస్తి పన్నులో 57 శాతం అంటే రూ.27.21 కోట్లు, వాటర్ ట్యాక్స్‌లో 22 శాతం అంటే రూ.3.44 కోట్లు వసూలైంది. ఇలాగైతే అభివృద్ధి ఎక్కడ జరుగుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇప్పటి వరకు వసూళ్లు ఇలా

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను డిమాండ్ మొత్తం రూ.46.79 కోట్లు ఉంది. ఇప్పటి వరకు రూ.27.21 కోట్లు మాత్రమే వసూలైంది. మొత్తం బకాయిలో కేవలం 57 శాతం మాత్రమే వసూలైంది. దీనిలో పాత బకాయిలు రూ.14.48 కోట్లు,కరెంట్ ఇయర్ డిమాండ్ రూ.32.31 కోట్లు ఉండగా వీటిలో పాత బకాయిలు రూ.3.49 కోట్లు, కొత్త బకాయిలు రూ.23.21 కోట్లు వసూలైంది. నీటి పన్ను డిమాండ్ మొత్తం రూ.15.71 కోట్లు ఉండగా వసూలైంది కేవలం రూ.3.44 కోట్లు మాత్రమే కావడంతో 22 శాతం వసూలైంది. దీనిలో పాత బకాయిలు రూ.10.30 కోట్లు, కరెంట్ ఇయర్ బకాయిలు రూ.5.41 కోట్లు ఉండగా దీనిలో పాత బకాయిలు రూ.రూ.72 లక్షలు, కరెంట్ బకాయిలు రూ.2.72 కోట్లు వసూలైంది. ఖాళీస్థలాల పన్ను డిమాండ్ రూ.2.48 కోట్లు ఉండగా ఇప్పటి వరకు రూ.50 లక్షలు మాత్రమే వసూలైంది. ఇతర పన్నులు స్టాంప్ డ్యూటీ రిజిస్ట్రేషన్‌లు, ప్రకటనల ద్వారా వసూలు కావాల్సింది దాదాపు రూ.7.50 కోట్లు ఉండగా కేవలం రూ.2 కోట్లు లోపే వసూలైంది.

ప్రకటనలకే రెవెన్యూ విభాగం పరిమితం

నగరపాలక సంస్థలో పన్నులు వసూలు చేసే రెవెన్యూ విభాగం అధికారులైన ఆర్ఐలు, ఆర్‌ఓలు,వార్డు సచివాలయ సిబ్బందితో పన్నులను వేగవంతంగా వసూలు చేస్తున్నట్లు ప్రకటనలు గుప్పిస్తున్నారే తప్ప క్షేత్ర స్థాయిలో ఆశించిన ఫలితం రావడం లేదు. పన్నుల వసూళ్లకు సంబంధించి నగరపాలక సంస్థ పలు రాయితీలను ప్రకటించినా ఆశించిన ఫలితం రావడం లేదు. పన్నుల వసూళ్ల కోసం కార్పొరేషన్ పరిధిలో 8 టీమ్‌లు, ప్రచార వాహనాలు ఏర్పాటు చేశారు. పాత బకాయిలను వన్‌టైమ్ సెటిల్మెంట్ చేసుకోవడం ద్వారా పరిష్కరించుకోవచ్చునని చెబుతున్నారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌లో రాయితీ ఇస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభం అయిన ఏప్రిల్ నెలలో చెల్లిస్తే 5 శాతం మేరకు పన్ను రాయితీ అందిస్తున్నారు. అయినా పన్ను చెల్లింపుదారుల నుంచి స్పందన అంతంత మాత్రంగానే ఉంది.

పన్ను వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ



పన్ను వసూళ్లకు గతేడాది వసూళ్ల కంటే 12 శాతం అధికంగా లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. ఆటోల ద్వారా ప్రచారం నిర్వహించడం, ప్రత్యేక బృందాల ఏర్పాటు, సచివాలయాల వారీగా అత్యధికంగా బకాయిలు ఉన్నవారితో నేరుగా మాట్లాడుతున్నాం. టీమ్‌ల వారీగా విభజించి ప్రతి రోజు పర్యవేక్షిస్తున్నాం. గత సంవత్సరం ఆస్తిపన్ను రూ.27.17 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ.27.21 కోట్లు వసూలైంది. గత వసూళ్లను అధిగమించాం. చివరి వారం రోజుల్లో మరింత వసూళ్లు చేసే విధంగా కార్యాచరణ రూపొందించాం.

– ఎ.భానుప్రతాప్, కమిషనర్, ఏలూరు నగరపాలక సంస్థ

క్లుప్తంగా

బాలబాలికలకు ప్రతి ఆదివారం ప్రహ్లాద బడి



బాలలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఏలూరు శాఖ ఆధ్వర్యంలో బాలబాలికల కోసం ప్రతి ఆదివారం ప్రహ్లాద బడి నిర్వహించనున్నట్టు ఇస్కాన్ ఏలూరు శాఖ ప్రతినిధి రాధా వల్లభ దాస్ తెలిపారు. ఆదివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో ప్రహ్లాదబడి అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలల్లో వినయం, విధేయత, సంస్కారం పెంపొందించి, సంతోషంగా ఉండడానికి, ఉజ్వలమైన భవిష్యత్తుకు, మానసిక, వ్యక్తిత్వ వికాసానికి ఈ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయన్నారను. ప్రతి ఆదివారం బాలలకు భగవద్గీత శ్లోక పఠనం, మంత్ర మెడిటేషన్, నైతిక విలువలు, కీర్తనలు, నృత్యాలు నేర్పుతామన్నారు. ఇతర వివరాలకు 8919387849 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం బాలలకు ఇస్కాన్ ప్రతినిధులు బాలలకు ఉచితంగా పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు.

150 మందికి వైద్య పరీక్షలు

భీమడోలు: పూళ్ల వర్తక సంఘం కల్యాణ మండపంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పుప్పాల మోహనసీతారామయ్య ఫౌండేషన్ అధినేతలు పుప్పాల శ్రీనివాస్, పుప్పాల హరీష్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు ప్రారంభించారు. ఏలూరుకు చెందిన శ్రీకృష్ణా ఆసుపత్రి చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గుండపనేని రవీంద్రనాథ్, గైనిక్ నిపుణురాలు డాక్టర్ గుండపనేని రోషిణీల బృందం రోగులకు వైద్య సేవలందించారు. పరిసర గ్రామాల నుంచి తరలివచ్చిన 150 మంది చిన్నపిల్లలు, మహిళలకు వైద్య పరీక్షలు చేసి మందులను అందించారు.

సువార్త కూడికల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

భీమడోలు: క్రైస్తవ విశ్వాసులంతా తోటివారి పట్ల ప్రేమ, సహనం కలిగి ఉండాలని భీమడోలు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ అనిల్ అన్నారు. భీమడోలు ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఏప్రిల్ 5, 6, 7వ తేదీల్లో చర్చి ప్రాంగణంలో జరిగే నిత్య సహాయమాత 38వ సజీవధారల సువార్త కూడికల గోడ పత్రాలను గ్రామ పెద్దలతో కలిసి ఆవిష్కరించారు. సువార్త కూడికల్లో విశ్వాసులు పాల్గొని దేవుని దీవెనలను పొందాలన్నారు.

ఆర్యవైశ్యులంటే త్యాగానికి, ధర్మానికి ప్రతీక



మాట్లాడుతున్న సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరువీధి వేణుగోపాల్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆర్యవైశ్యులంటే త్యాగానికి, ధర్మానికి పెట్టింది పేరు అని వాసవి జాగృతి ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరువీధి వేణుగోపాల్ అన్నారు. ఆదివారం స్థానిక ఆదిత్య ప్రిన్స్ హోటల్‌లో వాసవీ జాగృతి ఇంటర్నేషనల్, వాసవీ జాగృతి జయభేరి ఐకాన్ 2025 కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వేణుగోపాల్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల గౌరవ నినాదంతో వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారి సంక్షేమం, అభివృద్ధికి సరికొత్త ఆలోచనలతో వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ సంస్థను స్థాపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డి.రాజేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్యవైశ్యులకు అండగా ఉంటానని, వారికి వివిధ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసే దిశగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎస్.మురళీమోహనరావు, నాదెళ్ల శ్రీనివాసులు, సుంకు చంద్రశేఖర్ గుప్తా, ఏవీవీ గుప్త, జూలూరి కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి



సీపీఐ ప్రచార జాత ప్రారంభించి మాట్లాడుతున్న జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

ఏలూరు (టూటౌన్): కేంద్ర, రాష్ట్ర,ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు,పార్టీ ఏలూరు జిల్లా ఇన్‌చార్జ్ అక్కినేని వనజ పిలుపునిచ్చారు. సీపీఐ శతవార్షికోత్సవాల సందర్భంగా ఏలూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో ప్రచార జాతను ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు.ప్రచార జాతా సందర్భంగా నాయకులకు, సీపీఐ శ్రేణులకు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు స్వాగతం పలికారు. సీపీఐ జిల్లా కార్యాలయం నుంచి చింత చెట్టు సెంటర్ రోడ్డు, భగత్ సింగ్ సెంటర్ వద్ద భగత్ సింగ్ విగ్రహానికి అక్కినేని వనజ, డేగా ప్రభాకర్, మన్నవ కృష్ణ చైతన్య, బండివెంకటేశ్వరరావులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి అల్లూరి సీతారామరాజు సెంటర్, ఆర్ ఆర్ పేట మీదుగా ర్యాలీ సీపీఐ జిల్లా కార్యాలయానికి చేరుకుంది. భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు ప్రచార జాత ద్వారా జిల్లాలలో సభలు, సమావేశాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, బాడిస రాము,కారం దారయ్య, కురెళ్ళ వరప్రసాద్, వరక శ్యామల తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయి ప్రేమ మందిర్‌లో అఖండ అన్న సమారాధన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ఆదివారపు పేటలో ఉన్న శ్రీ షిరిడి సాయి ప్రేమ మందిర్ ఆరో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ఉదయం అష్టోత్తర కలశాలతో మహిళా భక్తులతో గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు ఇసుకపల్లి తాతారావు ఆధ్వర్యంలో వివిధ నదుల జలాలను సేకరించి వాటితో బాబాకి అభిషేకం నిర్వహించారు. గురూజీ వాస ప్రసాద్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ, సాయిబాబాకు హారతి జరిపించారు. అర్చకులు గంగాధర్, శోభన్ బాబు ఆలయానికి విచ్చేసిన భక్తులకు గోత్రనామాలతో అష్టోత్తర పూజలు నిర్వహించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి



భగత్ సింగ్‌చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు



ఇఫ్టూ ఆధ్వర్యంలో అమరవీరుల వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బ్రిటిష్ సామ్రాజ్యవాదులు నాడు ప్రవేశపెట్టిన మెకాలే విద్యా విధానమే నేటికీ కొనసాగుతోందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని ఆందోళన వ్యక్తం చేశారు. భగత్ సింగ్ 94వ వర్ధంతిని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో స్థానిక సత్రంపాడు బీసీ బాయ్స్ కళాశాల హాస్టల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకి నాని మాట్లాడుతూ కామ్రేడ్ భగత్ సింగ్, రాజుగురు, సుఖదేవ్‌లని, 1931 మార్చి 23న బ్రిటిష్ సామ్రాజ్యవాదులు వీరి ముగ్గురిని క్రూరంగా ఉరితీసారన్నారు. నగర అధ్యక్షుడు వై.యశ్వంత్ అధ్యక్షన నిర్వహించిన కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ హరినారాయణ, కాకి నాని భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు హాస్టల్ కమిటీ అధ్యక్షుడు బి.హర్ష తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

ఇఫ్టూ ఆధ్వర్యంలో..

ఏలూరు (టూటౌన్): ప్రధాని నరేంద్రమోదీ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఇఫ్టూ ఉమ్మడిపశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు పిలుపు నిచ్చారు. ఇఫ్టూ నగర కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఏలూరు వన్ టౌన్ ఏరియాలో కల్పనా థియేటర్ వద్ద నుంచి ప్రదర్శనగా ఎన్ఎస్ మార్కెట్, చందన బ్రదర్స్, బడేటి వెంకట్రామయ్య చౌక్ పక్కన వున్న కార్మిక కూడలిలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఇఫ్టూ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బద్దా వెంకట్రావు తదితరలుఉ భగత్ సింగ్, సుఖదేవ్ రాజగురు చిత్రపటాల వద్ద ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో దూళ్ళ వీరనాయుడు, బాడిత వీరభద్రం, మీసాల రమణ, దుర్గారావు, బాలాజీ, సత్యనారాయణ, కల్యాణ్, రామయ్య, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్, రాజ్ గురు,సుఖ్ దేవ్ లకు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక సుందరయ్య కాలనీలో భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల చిత్రపటాలకు డీవైఎఫ్: మాజీ నాయకులు పి.ఆదిశేషు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ భగత్ సింగ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్ కనకారావు, వీవీఎస్ ప్రసాద్, జె.గోపి, బి.సోమయ్య,చల్ల పైడియ్య, ఆర్.నరసింహమూర్తి, సత్తిరాజు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	40	బీన్లచిక్కుడు	88
వంకాయలు (తెలుపు)	40	చామదుంపలు	48
బెండకాయలు	32	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	28	కంద	76
కాకర కాయలు	34-38	బీట్‌రూట్	30
బీరకాయలు	34	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	34	పాలకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	30	చుక్కకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	24-34	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	50
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	16
ఏలూరు - తిరుపతి (ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	26
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

‘అత్యుత్తమ ప్రాజెక్టులు ఏలూరు జిల్లాలోనే..’



లయన్స్ జిల్లా కన్వెన్షన్‌లో మాట్లాడుతున్న జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రపంచంలోనే అత్యుత్తమ పర్మినెంట్ ప్రాజెక్టులు ఉన్న జిల్లాగా ఖ్యాతి అర్జించిందని, దీనిని ఇలాగే కొనసాగించాలని లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు తెలిపారు. లయన్స్ జిల్లా 316 జీ 19వ జిల్లా కన్వెన్షన్ స్థానిక క్రాంతి కల్యాణ మండపంలో ఆదివారం వేణుబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు బాబు మాట్లాడుతూ లయన్స్ ఇంటర్నేషనల్‌కి 90 వేల డాలర్లకు పైగా విరాళాలు అందించామని, ఇది మన ఆంధ్ర రాష్ట్రంలోనే అత్యధికమని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లయన్స్ ఇంటర్నేషనల్ తృతీయ వైస్ ప్రెసిడెంట్ ఎండార్స్ వేగేశ్న విజయ్ కుమార్ రాజు మాట్లాడుతూ ప్రతి మనిషి సేవతో ఎంతో తృప్తి చెందుతారని పేర్కొన్నారు. 2025-2026 సంవత్సరానికి జరిగిన ఎన్నికలలో జిల్లా గవర్నర్‌గా ఎన్‌వీవీఎస్ పాపారావు నాయుడు, ప్రథమ వైస్ గవర్నర్‌గా డాక్టర్ డి. సుబ్బారావు, ద్వితీయ వైస్ గవర్నర్‌గా ఆర్‌వీఎస్ సూర్యనారాయణ రాజు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి డాక్టర్ పి. విజయభాస్కర రెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో మల్టిపుల్ చైర్‌పర్సన్ దామర్ల శ్రీ శాంతి, ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఎండార్స్ పి. సుభాష్ బాబు, ఎం.శ్రీరామ్ సురేష్, వేమా కోటేశ్వరరావు, డాక్టర్ వీకే పంకజాక్షన్, సీహెచ్. సత్యనారాయణమూర్తి, కేవీ కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించాలి



పాదయాత్ర నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 26న మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సీపీఎం నగర కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం పడమర వీధి ప్రాంతాల్లో ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పాదయాత్ర బృందం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ సీపీఎం రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తుందని అన్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 మాసాలైనా నేటికీ వారు చేసిన వాగ్దానాలు అమలు చేసే ప్రయత్నం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో టిడ్కో ఇల్లు నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు యుద్ధప్రాతిపదికన ఇస్తామని వాగ్దానం చేసిన చంద్రబాబు వాటి ఊసే ఎత్తకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వైఎస్ కనకారావు, వీవీఎన్ ప్రసాద్, పి ఆదిశేషు, కె.విజయలక్ష్మి,దుర్యోధన, బి.సోమయ్య, జి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ‘చదవడం మాకిష్టం’



భీమడోలులో పుస్తక పఠనం చేస్తున్న బాలబాలికలు

భీమడోలు: మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు హాజరైన తమకు నచ్చిన పుస్తకాలను ఎంపిక చేసి పుస్తక పఠనం చేశారు. తెలుగు, ఇంగ్లీషు నీతి కథలు, సైన్సు పుస్తకాలను చదివారు. వాటి సమీక్షలు రాశారు. తొలుత ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవం, కవితా దినోత్సవం, అమరవీరుల దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాటి విశిష్టతను గ్రంథపాలకుడు వారికి వివరించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్, అమరజీవి పొట్టి శ్రీరాములు జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో భీమడోలు, పూళ్ల, గుండుగొలను లైబ్రేరియన్లు కె.శ్రీనివాస్, డీఎన్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో యథేచ్ఛగా బెల్ట్‌షాపులు



మండలంలోని ఓ గ్రామంలో బెల్ట్ షాపు

పెదవేగి : నియోజకవర్గంలో ప్రతి పల్లెలో బెల్ట్ దుకాణాలు యథేచ్ఛగా నిర్వహిస్తుండడంతో మద్యం ఏరులై పారుతోంది. ప్రభుత్వం బెల్ట్ దుకాణాలపై నిషేధం విధించినా మద్యం వ్యాపారులు నిబంధనలకు తూట్లు పొడుస్తూ విచ్చలవిడిగా గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు ఏర్పాటుచేశారు. ఒక్కో గ్రామంలో ఒకటి నుంచి మూడు దుకాణాల వరకు ఏర్పాటు చేసి నడిపిస్తున్నారు. మండలంలోని కూచింపూడి, కొప్పాక, రామశింగవరం, రాట్నాలకుంట, వేగివాడ, నడిపల్లి, బోగాపురం, అమ్మపాలెం, దిబ్బగూడెం, నాగన్నగూడెం, జానంపేట, ఇతర గ్రామాల్లో గొలుసు దుకాణాలు ఏర్పాటయ్యాయి. బెల్ట్ దుకాణాల్లో లూజు, చీప్ లిక్కర్ విక్రయాలు సాగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. గొలుసు దుకాణాలపై ఎక్సైజ్ అధికారులు తెలియనట్లు వ్యవహరించడంపై బహిరంగానే పలువురు విమర్శిస్తున్నారు. గత కొద్ది రోజుల క్రితం బి శింగవరం, బాపిరాజుగూడెంలో ఒక బెల్ట్ దుకాణాన్ని పట్టుకుని కేసు నమోదు చేయకుండా అధికారులు దోచుచులాడారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి బెల్టు దుకాణాలను పూర్తిగా తొలగించాలని స్థానికులు, మహిళలు కోరుతున్నారు.

డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన

దెందులూరు: పోతునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దొండపాడు ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో డౌన్ సిండ్రంపై అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీడీఆర్‌సీ సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ సిండ్రోమ్ ఉన్న వ్యక్తుల జీవన నాణ్యత మెరుగుపరచవచ్చునన్నారు. అనునిత్యం వైద్యుల తనిఖీలు పర్యవేక్షణలో ఫిజియోథెరపీ స్పీచ్ థెరపీ వైద్య సేవలను అందించడంతోపాటు నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. సమావేశంలో దివ్యాంగుల పునరావాస కేంద్రం వైద్యశాల సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం

ఏలూరు (టూటౌన్): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అసెంబ్లీలో వర్గీకరణ బిల్లు ఆమోదించడంపై ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు బయ్యారపు రాజేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జ్ కాశీ కృష్ణ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ కోసం మూడు దశాబ్దాల పాటు అనేక ఒడిదుడుకులు ఎదురొడ్డి నిరంతర పోరాటాలు చేసిన మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అయిన పర్తి మాధవ రావు, బయ్యారపు కుటుంబరావు, దుగ్గిపోగు బాబురావు పాల్గొన్నారు.